పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి ముంచింగి పుట్టు : గర్భిణీల దశ నుండి బిడ్డ పుట్టి రెండేళ్లు వరకు తీసుకోవలసిన జాగ్రత్తలపై పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ముంచింగిపుట్టు అంగన్వాడి కేంద్రం 1 లో మంగళవారం సూపర్వైజర్ వరహాలమ్మ, అంగన్వాడి కార్యకర్త సుజాతలు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సూపర్వైజర్ వరహాలమ్మ మాట్లాడుతూ, ఏప్రిల్ 8వ తేదీ నుండి 22వ తేదీ వరకు ఆయా సెంటర్లలో నిర్వహిస్తున్నమన్నారు, గర్భిణీలు పోషణ తీసుకోకుంటే పుట్టబోయే బిడ్డ తక్కువ బరువుతో లేదా పోషకాహార లోపంతో పుట్టడం జరుగుతుందన్నారు. గర్భవతులు ప్రతిరోజు ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. పాలు, గుడ్లు వారంలో వీలైనంత ఎక్కువసార్లు లేదా కనీసం ఆరుసార్లు అయినా తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలు, పోషక విలువలు ఉండే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ మాధవిలత పాల్గొన్నారు.

ఏజెన్సీలో పవన్ విస్తృత పర్యటన

-రెండో రోజు పలు కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి
-కురిడిలో రచ్చబండ- సుంకరమెట్టలో ఉడెన్ బ్రిడ్జ్ ప్రారంభం
-కాఫీ తోటలు పరిశీలన-సమస్యల పరిష్కారానికి హామీ

ఉడెన్ బ్రిడ్జిన్ ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఏజెన్సీలోని డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెండో రోజైన మంగళవారం పర్యటించారు. కురిడిలోని రచ్చబండలో గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సుంకరమెట్టలో ఉడెన్ బ్రిడ్జిన ప్రారంభించారు. కాఫీ తోటలను పరిశీలించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు.

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ డుంబ్రిగుడ మండలం కురిడి గ్రామంలో మంగళవారం పర్యటించారు. ముందుగా ఆ గ్రామంలోని భ్రమరాంబ శివాలయంలో దర్శించి పూజలు నిర్వహించారు. గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఆ గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అరకులోయ మండలంలో పర్యటించారు.

ఎకో టూరిజం అబివృద్ధిలో భాగంగా అరకులోయ మండలం సుంకరమెట్ట కాఫీ ఎస్టేట్స్‌లో ఏర్పాటు చేసిన చెక్క వంతెనను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణశాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు సుంకరమెట్టలో రూ.19 లక్షల అంచనా వ్యయంతో కాఫీ తోటల మధ్య నిర్మించిన చెక్క వంతెనను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకు వచ్చారు. ముందుగా ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఆర్ వి సుజయ కృష్ణ రంగారావుతో కలసి కాఫీ తోటల్లో మొక్కలు నాటారు. అనంతరం కాఫీ తోటల మధ్య ఆ వంతెనపై కెనోపీ వాక్ ప్రారంభించారు.ఉడెన్ బ్రిడ్జ్ పై నడుస్తూ కాఫీ తోటలను పరిశీలిస్తూ అటవీశాఖ నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు.సిల్వర్ ఓక్ చెట్ల మధ్య వేసిన కాఫీ మొక్కలు, ఎత్తయిన మొక్కలపైకి పాకిన మిరియాల పంటల సాగుపై ఆరా తీశారు.ఆ ంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఫోటో గ్యాలరీని తిలకించారు.ఈ సందర్భంగా అరకు డిలైట్ కాఫీ బ్రాండ్ ప్రోమోషన్ తో పాటు సుంకరమెట్ట ఎకో టూరిజం పోస్టర్లు, బ్రోచర్లను ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కజూరియా, విశాఖ రీజన్ ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ డాక్టర్ జ్యోతి తుల్లిమెల్లి, జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్,జెసి అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, గ్రామ సర్పంచ్ జి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

-డిప్యూటీ సిఎంకు సర్పంచ్ చినబాబు వినతి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని సుంకరమెట్టలో ఉడెన్ బ్రిడ్జ్ ప్రారంభించడానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు సుంకరమెట్ట పంచాయతీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని స్థానిక పంచాయతీ సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ చినబాబు మాట్లాడుతూ, సుంకరమెట్ట పంచాయతీ కేంద్రంలో ఉన్న ఎంపియుపి పాఠశాలను ఆశ్రమ పాఠశాలగా అప్గ్రేడ్ చేయాలని కోరారు. పంచాయతీ పరిధిలో పిరిబంద, లింబగుడ, దండబాడు, గంగుడిలో పాఠశాల భవనాలు మంజూరు చేయాలని చేయాలని కోరారు. పంచాయతీలో మంజూరైనా దండబాడు నుండి లింబగుడ రోడ్డు, దొడగుడ నుండి కె బెడగుడ రోడ్డు నిర్మాణం కోసం ఫారెస్ట్ అధికారులు ఆటంకం లేకుండా చేయాలని చూడాలన్నారు. పంచాయతీ లో మౌళిక సదుపాయాలు సిసి రోడ్డు, డ్రైనేజీ,మంచి నీరు జలజీవన్ మిషన్ వాటర్ స్కీమ్ వంటి ప్రధాన సమస్యలు పరిష్కారం కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

-డిప్యూటీ సీఎంకు జెడ్‌పిటిసి గంగరాజు, ప్రజాప్రతినిధుల వినతి

అరకులోయ రూరల్: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ, డుంబ్రిగూడ మండలాల్లో రెండు రోజులు పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ను అరకు రైల్వే అతిథిగృహంలో మంగళవారం అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు, రాష్ట్ర సర్పంచ్ ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, ప్రజా ప్రతినిధుల బృందం కలిసి నిధులు కోసం అరగంటసేపు చర్చించారు. అనంతరం ఏజెన్సీ ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై ప్రస్తావిస్తూ అరకులోయ ఏరియా ఆసుపత్రిలో గర్భిణీలకు ప్రత్యేక స్కేనింగ్ సెంటర్ లేక మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన గర్భిణీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రత్యేక స్కానింగ్ సెంటర్ను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతగిరి మండలంలో 25 సంవత్సరాల క్రితం వేసిన బీటి రోడ్లు గతుకుల మయంగా మారాయని దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు.ఈ సందర్భంగా అనంతగిరి జెడ్పిటిసి డిసరి గంగరాజు మాట్లాడుతూ, అనంతగిరి మండలంలోని బొర్రా గేటువలస నుండి కోనాపురం మీదుగా కరాయిగుడ నుండి లోతేరు జంక్షన్ వరకు 12 కిలోమీటర్ల రోడ్లు పూర్తిగా దంసమై ప్రమాదకరంగా మారిందని తెలిపారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం మీదుగా అనంతగిరి మండలం జీనబాడు పినకోట, పెదకోట, కివర్ల పంచాయితీల మీదుగా హుకుంపేట మండలం ఉప్ప వరకు బీటి తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు.ఎగువశోభ పంచాయితీ మరదగుడ కాఫీ ప్లాంటేషన్ నుండి జాముగుడ, కమలాపురం మీదుగా ఎగువశోభ వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, టోకురు సర్పంచ్ కిల్లో మొస్య, గసభ సర్పంచ్ పాంగి సునీత, పద్మపురం సర్పంచ్ పెట్టెలి సుస్మీత, కొర్రాయి సర్పంచ్ పూజారి కొమ్ములు,బొండం సర్పంచ్ దురియ భాస్కరరావు, ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు నరాజీ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీలో ఆలస్యంపై నిరసన

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: కుల, ఆదాయ ధ్రువ పత్రాల ఆలస్యంపై తహసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం మండల కార్యదర్శి కొర్ర త్రినాథ్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల డిప్యూటీ తహసీల్దార్ ఈనెల 27వ వరకు సెలవు పెట్టడంతో కుల, ఆదాయ ధ్రువపత్రాలు ఆలస్యం అవుతుందన్నారు. ఎఫ్ఎసి తహసిల్దార్‌ని నియమించకపోవడంతో మండల ప్రజలు కుల, ఆదాయ, తదితర ధ్రువపత్రాల నిమిత్తం వచ్చి నిరాశ చెందుతూ తిరిగి వెళ్ళిపోయారన్నారు. మంగళవారం అంగన్వాడి పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకునే వారు అధిక సంఖ్యలో వచ్చారని, ఈనెల 10వ తారీఖుతో చివరి తేదీ కావడంతో కుల ఆదాయ ధ్రువపత్రాలు పొందలేక అవకాశాన్ని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎఫ్ఎసి తహసిల్దార్‌ను తక్షణమే నియామకం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ నాయకులు ఎం.నర్సింగ్ పడాల్, పి.భీమరాజు, కె.శంకర్, పీఎం జన్మన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న లబ్ధిదారులు

ఇంటి పన్నులు తగ్గించాలి

ప్రజాశక్తి-పెదబయలు : సీతగుంట పంచాయతీలో ఎటువంటి సదుపాయాలు కల్పించకుండా అధిక మొత్తంలో ఇళ్ల పన్నులు వసూలు చేయడం తగదని సిపిఎం కార్యదర్శి బోండా సన్నిబాబు తెలిపారు. సీతగుంట పంచాయతీ లో 11 గ్రామాలు ఉన్నాయన్నారు. ఇళ్ల పన్నుల పేరుతో నీటి, గ్రంథాలయం పన్నుల పేరుతో అధికంగా ఇంటి పన్ను వసూలు చేస్తున్నారన్నారు. అధికంగా వసూలు చేస్తున్న పన్నులు తగ్గించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేసారు. సీత గుంట పంచాయతీ పరిధి గ్రామాల్లో అసౌకర్యాలు నెలకొన్నాయన్నారు.ప్రధాన రహదారిలోనే మాత్రమే శుభ్రత పరిశుభ్రత పాటిస్తున్నారని చుట్టుపక్కల గ్రామాల్లో అటువంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. వీధిలైట్లు వెయకపోవడంతో పెదబయలు మండల కేంద్రానికి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

రాత్రి 11 గంటలకు బయలుదేరిన హుకుంపేట బస్సులో వెళుతున్న విద్యార్థులు

విద్యార్థుల ఆకలికేకలు

- అరటిపండు, చెక్కి, ఫ్రూటీ తోనే సరిపెట్టిన అధికారులు
రాత్రి 12 గంటలకు తిరుగు ప్రయాణం
-ఇదీ 108 మహా సూర్య నమస్కారంలో పాల్గొన్న విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి- అరకులోయ: ప్రపంచ రికార్డు కోసం అరకులోయలో డిగ్రీ కళాశాల మైదానంలో 108 సూర్య నమస్కారాలు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందుకు ప్రపంచ రికార్డు సర్టిఫికెట్ కూడా బహుకరించిన విషయం కూడా తెలిసిందే. ఈ కార్యక్రమానికి 21 వేల 850 గిరిజన విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని 108 సూర్య నమస్కారాలు చేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సూర్య నమస్కారాల ఆసనాలు చేశారు. సూర్య నమస్కారానికి కార్యక్రమానికి వివిధ మండలాల నుంచి వచ్చిన విద్యార్థులకు రాత్రి భోజనాలు పెట్టడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. సోమవారం సాయంత్రం ఐదు గంటల నుంచి సూర్య నమస్కారం ప్రారంభమై 8 గంటలకు ముగిసింది. తర్వాత వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ కూడా అధికార యంత్రంగానికి అందజేశారు. తర్వాత విద్యార్థులకు రాత్రి భోజనం పెట్టి ఆయా వసతి గృహాలకు బస్సులో తరలించవలసి ఉండగా, రాత్రి 12 గంటల సమయం అయినా కొన్ని మండలాల విద్యార్థులకు తరలిస్తూనే ఉన్నారు. విద్యార్థులకు ఒక చెక్కి, ఒక అరటిపండు, ఒక చిన్న ఫ్రూటీ అందజేశారు తప్పా, మధ్యాహ్నం నుంచి ఆకలితో ఉండి ఆసనాలు చేసి అలసిపోయిన విద్యార్థులకు రాత్రి 12 వరకు కూడా భోజనాలు పెట్టకపోవడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలకు ఏమైనా అయితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. హుకుంపేట, శ్రీకృష్ణ పురం, గూడ, గన్నెల పాఠశాలలకు చెందిన విద్యార్థులు అరకులోయలోనే రాత్రి 11:30 గంటల కు బస్సులు బయలుదేరాయి. ఈ బస్సులు వారి పాఠశాలకు చేరుకోవాలంటే కనీసం రెండు గంటలు సమయం పడుతుంది. అంటే ఒంటి, రెండు, గంటలు అవుతుంది. అంతవరకు విద్యార్థులు ఆకలితో అలమటించవలసిన పరిస్థితి ఏర్పడిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు నిబంధనలకు విరుద్ధంగా ఒక్కొక్క బస్సుల్లో 100 నుంచి 130 మంది వరకు పిల్లలను కుక్కి తీసుకొని వెళ్లడం గమనార్హం

ఈ విషయంపై పాడేరు డిడి రజినిని సంప్రదించగా, అందరికీ స్నాక్స్, ఫుడ్ పెట్టామని చెప్పారు. విషయం తెలుసుకున్న పెద్దలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసు బాబు విద్యార్థులను ఆకలితో ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు.

పశువులను అప్పగించాలి

ప్రజాశక్తి -అనంతగిరి: బీంపోలు పంచాయతీ సచివాలయం సిబ్బంది అక్రమంగా బంధించిన తమ పశువులను తిరిగి అప్పగించాలని మంగళవారం రైతులు మిరియాల .వెంకటరావు, గరివెలి .దేవరాజులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వారం రోజులు తమ పశువులను అక్రమంగా బంధించారన్నారు. తమ పశువులను ఎందుకు బంధించారని సిబ్బందికి అడగగా ఒక్కొక్క పశువుకు వెయ్యి రూపాయలు చొప్పున చెల్లించాలని, అప్పుడే ఇస్తామని లేకుంటే వేలం వేస్తామని తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వారు వాపోయారు. బంధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏజెన్సీలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. హడ్కో సంస్థ మండలంలోని 27 పాఠశాలలకు రూ.17 లక్షల విలువైన ఫర్నిచర్‌ను సమకూర్చగా, వాటిని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎమ్మెల్యే శిరీషదేవి చేతుల మీదుగా ఆయా పాఠశాలలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏజెన్సీ ప్రాంతంలో చాలా పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయని, ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. నిధుల కొరతతో వీటి నిర్మాణం కొంత ఆలస్యం అవుతుందన్నారు. అనంతరం సంస్థ ప్రతినిధులు ఎమ్మెల్యే శిరీషదేవి, విజయభాస్కర్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి, లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు, ఎంఈఓ కేవీపీ సత్యనారాయణ, ఎంఈఓ 2 సూరారెడ్డి, సీఐ ఎన్.సన్యాసినాయుడు, ఎస్ఐ నరసింహమూర్తి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లోతా లక్ష్మణరావు, కమిటీ సభ్యులు, పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

సాగునీటి కాలువ మరమ్మతు పనుల పరిశీలన

మండలంలోని వట్టిగెడ్డ రిజర్వాయర్ ద్వారా పంట పొలాలకు నీరు వెళ్లే కాలువ మరమ్మతు పనులను ఎమ్మెల్యే శిరీషదేవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే చెరువులు, రిజర్వాయర్లు, ఆనకట్టలు మరమ్మతులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని చెప్పారు. రూ.10 లక్షల వట్టిగెడ్డ రిజర్వాయర్ కాలువ మరమ్మతు పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, కార్యదర్శి ముప్పన కేశవ్, సర్పంచ్ జి రమణి, ఏఎంసీ ఛైర్మన్ లోతా లక్ష్మణరావు, మాజీ సొసైటీ సభ్యులు జి.తాతారావ్, జనసేన పార్టీ నాయకులు త్రిమూర్తులు పాల్గొన్నారు.

మిర్చి, పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కూనవరం

మిర్చి, పొగాకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని లింగాపురం సీపీఎం గ్రామ శాఖ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వరదల వల్ల పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులు మంచి రేటు ఉందని ప్రైవేటు అప్పులు తెచ్చి మిర్చి పంట సాగు చేశారని తెలిపారు. మిర్చి ధర పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నా ప్రభుత్వం స్పందించకపోవటంతో రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పొగాకు పంట సాగు చేయమని చెప్పిన కంపెనీలు పంట పండిన తర్వాత రైతులను మోసం చేస్తుంటే కూటమి ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం రైతులకు అమ్మే డీజిల్ ధర ప్రతి ఏడాది పెంచుతుందని, కాని రైతు పండించిన పంటలకు ధర ఇవ్వడం లేదన్నారు. దళారీ వ్యవస్థను తగ్గించి మార్కెట్ సదుపాయం ప్రభుత్వం కల్పించాలని, ప్రతి మండలంలో మిర్చికి శీతల గిడ్డంగులు నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణ సదుపాయం కల్పించాలని, పొగాకు పంటను ఎటువంటి షరతులు లేకుండా కంపెనీలు కొనుగోలు చెయ్యాలని, పొగాకు ఒప్పంద రేటును ప్రభుత్వం చొరవ తీసుకొని ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, సర్పంచ్ సోడె శంకర్, మాజీ సర్పంచ్ సోడె రాఘవయ్య, సోడె రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు

గోదావరి డెల్టాకు నిలిచిన నీటి విడుదల

ప్రజాశక్తి-సీలేరు : సీలేరు కాంప్లెక్స్ పరిధి దిగువ సీలేరు డొంకారాయి జలాశయం స్పిల్ వే గేట్లు నుంచి గోదావరి డెల్టా రబీ పంటకు నీటి విడుదలను మంగళవారం నుంచి నిలిపివేసామని సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు వెల్లడించారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటకు డొంకరాయి జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు ఏపీ జెన్కో ఉన్నతాధికారులకు కోరిన మేరకు ఫిబ్రవరి 10వ తేదీ నుంచి 3000 క్యూసెక్కులు చొప్పున, మార్చి ఒకటి నుంచి 4000 క్యూసెక్కులు చొప్పున, మార్చి 21 నుంచి 5000 క్యూసెక్కులు చొప్పున విద్యుత్ ఉత్పత్తి చేయకుండా నేరుగా గోదావరి డెల్టా రవి పంటకి నీటి విడుదల చేశామని తెలిపారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో ఆంధ్ర వాట కలుపుకోని డొంకరాయి, గుంటవాడ జలాశయాల్లో మొత్తం 48 నుంచి 50 టిఎంసిల వరకు నీటి నిల్వలు ఉన్నాయన్నారు. మండు వేసవిలో కూడా సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు డొంకరాయి, పోల్లూరు, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాల్లో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపడుతున్నామని విద్యుత్ ఉత్పత్తికి ఎటువంటి డోకా లేదని వాసుదేవరావు వెల్లడించారు.

మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు

రెజ్లింగ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం, పీడీ

రెజ్లింగ్‌లో ఆశ్రమ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజమండ్రిలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో రంపచోడవరం మండలం ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బాయ్స్ అండర్-15లో సిహెచ్.భువన్ కుమార్ 41 కేజీలు, కె.కిరణ్ దొర 48కేజీలు, పిజె.ప్రకాష్ 38 కేజీలు విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.ఆదివిష్ణు, పిడి సుగంధి తెలిపారు. రెజ్లింగ్ నేషనల్ లెవెల్‌కు సెలెక్ట్ అయిన విద్యార్థులకు డిప్యూటీ డైరెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. వారిని డిప్యూటీ డైరెక్టర్ అభినందించారు.

భూమి పూజ నిర్వహిస్తున్న సర్పంచ్ రాజమణి

నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-దేవీపట్నం : మండలంలోని దేవీపట్నం పంచాయతీ ఇందుకూరు వన్ ఏనుగులగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పశువులకు నీటి తొట్టెల నిర్మాణ పనులకు దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి మంగళవారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో పశువులు నీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ ద్వారా నీటి తొట్టెలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రత్నకుమారి, ప్రోగ్రాం అదనపు అధికారి లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయ అధికారి ఆర్.ప్రశాంతి, మండల అధ్యక్షులు మరిశేట్ల వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ మాగాపు బాబురావు, తెలుగు యువత మండల అధ్యక్షులు లంక హరిచంద్రుడు, జనసేన మండల అధ్యక్షుడు చారపు రాయుడు, కారం రామన్న దొర, పెద్ద సుబ్బారావు, జొన్నల రాంబాబు పాల్గొన్నారు.

అభివృద్ధిలో వెనుకబడిన చింతపల్లి ప్రాంతం

ప్రజాశక్తి-సీలేరు : 2009లో చింతపల్లి అసెంబ్లీ నియోజకవర్గం రద్దయిన తరువాత అధికారులు, పాలకులు నిర్లక్ష్యం కారణంగా చింతపల్లి ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడి పోతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సౌకర్యాలు కొరవడి అభివృద్ధి ఎక్కడ వేసిన గోంగలి అక్కడే అన్న చందంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జికె.వీధి మండలం ఆర్‌వి నగర్ నుంచి పాలగడ్డ వరకు అంతర్రాష్ట్ర రహదారి దశాబ్దాల కాలంగా అస్తవ్యస్తంగా ఉన్నా పట్టించుకునే నాథడే లేరన్నారు. జిల్లా పర్యటనలో ఉన్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చింతపల్లి, జికె.వీధి, కొయ్యూరు, వై.రామవరం మండలాలు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. చింతపల్లిలో మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల, వ్యవసాయ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, హార్టికల్చర్ కళాశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

గంజాయి సాగు అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం నల్లగొండ పంచాయతీ బోయవుట గ్రామంలో గంజాయి సాగు వల్ల జరుగు అనర్థాలపై రైతులకు మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చేయడం చట్టరీత్యా పెద్ద నేరమని, అటువంటి చర్యలకు పాల్పడితే కేసులు, శిక్షణలు తప్పవని హెచ్చరించారు. అందువల్ల గిరిజన రైతులు గంజాయి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. సంప్రదాయ పంటలైన చోడు, సామ వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. సాగునీటి బోరు తీసుకొనేందుకు అవకాశం కల్పించాలని రైతులు వ్యవసాయ అధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు హరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి ఉమాదేవి

లక్ష్మీకాంతాన్ని సత్కరిస్తున్న డీడీ రజని

ఉద్యోగులకు సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి-పాడేరుటౌన్:ఉద్యోగులు పనిచేస్తున్న సమయంలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని టిడబ్ల్యు డిడి ఎల్.రజని అన్నారు. పదవీ విరమణ పొందిన జిటిడబ్ల్యు పోస్ట్ మెట్రిక్ హాస్టల్ (బాలికలు-1) హెడ్ కుక్ బి.లక్ష్మీకాంతంను మంగళవారం హాస్టల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిడి మాట్లాడుతూ, ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యమని, ఆరోగ్యాన్ని ఎల్లవేళలా కాపాడుకుంటూ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని సూచించారు. దాదాపు 39 సంవత్సరాలు గిరిజన సంక్షేమ శాఖకు సేవలందించి పదవీ విరమణ పొందడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దారెల సర్పంచ్ పాండు, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్ల (బాలికలు) హెచ్‌డబ్ల్యూఒలు శేషకుమారి, సువర్ణ, కనకమహాలక్ష్మి, అరుణ, ఇతర సిబ్బంది, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎపిడి , ఎంపిడిఒ

నీటి కుంటలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి -అనంతగిరి:ఉపాధి హామీ పథకంలో భాగంగా నీటి కుంటలను జూన్ నాటికి పూర్తి చేయాలని, పనులు చేయడంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని డుమా పిడి విద్యాసాగర్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కొండిభ పంచాయతీ పరిధి టైడాలో ఏర్పాటు చేసిన ఫారం పాండ్స్ ప్లాంటేషన్ పరిశీలించారు, అనంతరం స్థానిక ఎంపీడీవోతో కలసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో కుమార్, ఏపీడీ పవన్, ఏపీవోలు సన్యాసినాయుడు, .అర్జున్, శోభన్ బాబు పాల్గొన్నారు

జల్ జీవన్ మిషన్ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ధనసాని

జల్ జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని సూకూరు గ్రామపంచాయతీ గొందురు గ్రామంలో జల జీవన్ మిషన్ పథకం ద్వారా మంచి నీళ్లు అందించుటకు పనులను మంగళ వారం స్థానిక సర్పంచ్ ధనసాని సత్యవతి ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గొందురు గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా 13లక్షల రూపాయలు నిధులు మంజూరు య్యాయని తెలిపారు. గ్రామంలో ఉన్న ప్రతీ ఇంటింటికి కొళాయి ద్వారా మంచినీళ్లు అందించే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఆమె అన్నారు. కార్యక్రమం లో పంచాయతీ సెక్రటరీ సరోజినీ, స్థానిక నాయకులు ధనసాని మురళి,వార్డ్ మెంబర్ సత్తారావు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

ఎంపీ తనూజా రాణి

దిశ సమావేశంలో పాల్గొన్న ఎంపీ తనూజారాణి, కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : సంపూర్ణ గిరిజనాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని దిశ కమిటి అధ్యక్షురాలు, అరకు పార్లమెంటు సభ్యురాలు గుమ్మా తనూజా రాణి అన్నారు. గిరిజనులకు కనీస అవసరాలు సమకూర్చాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటి (దిశ) సమావేశం నిర్వహించారు. గత మూడు నెలలో 27 శాఖ ల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరు ధాన్యాలతో ఆహార ఉత్పత్తుల ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. జాతీయ రహదారి విస్తరణలో ధ్వంసమైన చెక్ డ్యాంలు, తాగునీటి పైపులైన్లు మరమ్మతులు ఎప్పటి లోగా పూర్తి చేస్తారని నేషనల్ హైవే అధికారులను అడిగి తెలుసు కున్నారు. గిరిజన రైతులకు ఉపయోగా పడే వ్యవసాయ ఉప కరణాలు పంపిణీ చేయాలని సూచించారు. నాబార్డు ద్వారా అమలు చేస్తున్న పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న అంబులెన్సులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొదటి విడతలో 10 అంబులెన్సులను చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాను ఆర్గానిక్ జిల్లాగా ప్రకటించడానికి అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు. ప్రణాళికాబద్ధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ ఉపకరణాలు లబ్ధిదారులకు పంపిణీ చేసేటప్పుడు స్థానిక సంస్థ ప్రజా ప్రతినిధులతో కలిసి అవసరమైన ఉపకరణాలు పంపిణీ చేయాలని సూచించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న భూముల రహదారి నిర్మాణ వ్యర్థాలను వేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని వ్యర్థాలు పంట భూముల్లో వేయకుండా తగిన చర్యలు చేపట్టాలని జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. లంబసింగి నుండి జి.మాడుగుల, జి.మాడుగుల నుండి పాడేరు రహదారి పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. అరకు బైపాస్ రోడ్డు పనులు, పెండింగ్ లో ఉన్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఒక్క ఎకరాల్లో కాఫీ తోటల పెంపకానికి అవసరమైన నీడ తోటల పెంపకానికి గిరిజన ప్రాంతంలో నర్సరీలు పెంచాలని సూచించారు. జిల్లాలో పరిశ్రమల పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. ఐసిడి ఎస్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న 7వ పోషణ పఖ్వాడా గోడ పత్రికను ఆవిష్కరించారు. గర్భం దాల్చిన దగ్గర నుండి వెయ్యి రోజుల సంరక్షణ చేపట్టాలన్నారు. నాబార్డు పొటెన్షియల్ లింక్ క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, చింతూరు రంపచోడవరం పి. ఓలు అపూర్వ భరత్, కె.సింహాచలం, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ అరకు శాసన సభ్యులు రేగం మత్స్యలింగం, జిల్లా పరిషత్ సి.ఇ.ఒ .పి.నారాయణ మూర్తి, డి ఆర్ డి ఎ పి డి వి. మురళి, డుమా పిడి విద్యాసాగర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా, ఐసిడి ఎస్ పిడి పి. సూర్యలక్ష్మి, నాబార్డు డిడి ఎం చక్రధర్, ఎల్ డి ఎం మాతు నాయుడు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ. రమేష్ కుమార్ రావు, సిపి ఓ ఎస్ ఎస్ ఆర్ కె.పట్నాయక్, సెరికల్చర్ అధికారి అప్పారావు, ఎంపీపీలు రాజబాబు, వెంకటలక్ష్మి, శ్రీదేవి, లలిత తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యాన వినతులు

ప్రజాశక్తి-పెదబయలు :విఆర్‌ఏల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని స్థానిక తహసిల్దార్‌కి మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సన్నిబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో అనేక ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ గ్రామస్థాయిలో ఏళ్ల తరబడి పని చేస్తున్న విఆర్‌ఏల (విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్)ల సమస్యలు పరిష్కారం చేయలేదన్నారు.ఎన్నికల ముందు టిడిపి కూటమి అసంఘటిత కార్మికులందరికీ న్యాయం చేస్తావని వాగ్దానాలు చేసినప్పటికీ నేటికీ పది నెలలు కావస్తున్నా అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు.వీఆర్‌ఏలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, అర్హులైన వీఆర్‌ఏలను పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల మండల అధ్యక్షులు జి నీలకంఠం, మండల కార్యదర్శి నిక్కుల సుందర్ దేవ్, కోటేశ్వరరావు సతీష్ పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: వీఆర్‌ఏల సమస్య పరిష్కారం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో డీటీ దన్నుకు మంగళవారం సిఐటియు మండల కార్యదర్శి శంకర్రావు, మాజీ అధ్యక్షుడు భీమరాజు ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. సిఐటియూ ఉపాధ్యక్షులు పి భీమరాజు, కార్యదర్శి శంకర్రావు మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా వివిధ రకాల పనులను విఆర్‌ఎలకు అప్పగిస్తున్నారన్నారు. ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్మెన్, రికార్డ్ అసిస్టెంట్, డ్రైవర్ పోస్టులను అర్హతలు బట్టి వీఆర్‌ఏలతో భర్తీ చేయాలన్నారు. టిఏ, డిఏలు చెల్లించ లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు శ్యామ్, లోయిదాస్, పరశురాం పాల్గొన్నారు.

హుకుంపేట :వీఆర్‌ఏల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని స్థానిక డిప్యూటీ తహసిల్దార్ సిహెచ్ కృష్ణారావుకు వీఆర్‌ఏలు సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి అప్పలకొండ పడాల్ మాట్లాడుతూ, జీతాలు పెరగక వీఆర్‌ఏలు అవస్థలు పడుతున్నారన్నారు. ఏళ్ల తరబడి ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వీఆర్‌ఏల వయోపరిమితి మించిపోతుందని తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు ఆనంద్, రాంబాబు, బాబురావు, కృష్ణమూర్తి, ధన, లక్ష్మి, సర్రు హరిచందర్, తదితరులు పాల్గొన్నారు.

పెదబయలులో వినతిపత్రం అందజేస్తున్న సన్నిబాబు, విఆర్‌ఎలు

చింతపల్లి: చాలీచాలని జీతాలతో కుటుంబాలతో జీవించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షుడు కళ్యాణం అన్నారు. స్థానిక తహశీల్దార్ బి రవికుమార్‌ను కలిసి గ్రామ రెవెన్యూ సహాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో గత మూడేళ్ల క్రితం పే స్కేలు జీతాలు అమలు చేసి గ్రామ రెవెన్యూ సహాయకులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ దిశగా ఎందుకు పే స్కేలు అమలు చేయట్లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ రెవెన్యూ సహాయకులపై అదనపు భారం మోపి నిబంధనలకు విరుద్ధంగా పని చేయిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్య సహాయకుల కార్యదర్శి లోచల కృష్ణారావు, కంఠ బాలరాజు, బేరా రాణి పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న దొన్ను దొర, అధికారులు

బస్సు కాంప్లెక్స్ పరిశీలన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:ప్రముఖ పర్యాటక ప్రాంతమైన అరకులోయ బస్సు కాంప్లెక్స్‌ను ఏపీఎస్‌ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర మంగళవారం ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానంద రెడ్డి, విశాఖ ఆర్ఎం అప్పలనాయుడు, పాడేరు డిపో మేనేజర్ ఉమామహేశ్వర రెడ్డిలతో కలిసి బస్సు కాంప్లెక్స్ ను సందర్శించి చర్చించారు. ముందుగా అరకులోయ బస్సు ను పరిశీలించి అక్కడ ప్రస్తుతం ఉన్న సదుపాయాలపై ఆరా తీశారు. ఇక్కడ సౌకర్యాలు పెంచాల్సిన అవసరం ఉందని సియ్యారి దొన్నుదొర అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన అరకు ఇన్చార్జి శెట్టి చిరంజీవి, సర్పంచ్ దాసు బాబు,మహిళ నాయకురాలు, కళావతి, వార్డు నెంబర్ సోనాయి గంగ,టిడిపి నాయకుడు వంతల వెంకటరావు, టిడిపి నాయకులు,జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మాణ్ ఎన్జీవో సేవలు భేష్ : ఎంపీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో నిర్మాణ్ ఎన్జీవో హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్ చేస్తున్న కృషి అభినందనీయమని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ కొనియాడారు. ఇంపాక్ట్ హైరింగ్ కాన్సెప్ట్‌పై ఫోర్ పాయింట్స్ హోటల్‌లో నిర్మాణ్ ఎన్జీవో హెచ్ అర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హాజరై మాట్లాడారు. భారతదేశం ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న ఈ సమయంలో, అన్ని వర్గాలకూ సమాన అవకాశాలను కల్పించే విధానాలకు నిర్మాణ్ ఎన్జీవో హెచ్‌అర్ సంస్థ కృషి చెయ్యడం హర్షించదగిన విషయం అన్నారు. నిర్మాణ్ ఎన్జీవో హెచ్‌ఆర్ సంస్థ ఫౌండర్ అండ్ సిఇఒ మయూర్ పట్నాల మాట్లాడుతూ, "ఇంపాక్ట్ హైరింగ్ కేవలం ఉద్యోగావకాశాలు కల్పించడమే కాదని, ప్రతి ఒక్కరికి ఆర్థిక వ్యవస్థలో సమాన భాగస్వామ్యాన్ని కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ప్రస్తుతం నిర్మాణ్ ఆర్గనైజేషన్ 9 రాష్ట్రాల్లో 20 ప్రాంతాల్లో 56 స్కిల్ సెంటర్లు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్రా ఇండియా బిపిఒ ఎమ్‌డి లక్ష్మి ముక్కవిల్లి, ఇన్ఫోసిస్ విశాఖపట్నం డిసి హెడ్ సురేశ్ నర్రా, ఇన్‌వెస్కో ఇండియా హెచ్ ఆర్ డైరెక్టర్ ప్రత్యూష శర్మ పాల్గొని తమ అనుభవాలు పంచుకున్నారు.

స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ కృషి అభినందనీయం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : పుస్తకాలు లేకుండా విద్యను బోధించడంలో స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ చేస్తున్న కృషి అభినందనీయమని, విద్యార్థుల ప్రతిభ అద్భుతమని తెలంగాణ స్కూల్ కరస్పాండెంట్ దేవేందరరెడ్డి కొనియాడారు. స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ మద్దిలపాలెం కృష్ణా కాలేజ్ రోడ్ లోని మెయిన్ బ్రాంచ్‌కు తెలంగాణకు చెందిన వివిధ పాఠశాలలకు చెందిన 27 మంది కరస్పాండెంట్లు వచ్చి విద్యార్థుల ప్రతిభను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా దేవేంద్రరెడ్డి మాట్లాడుతూ నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి విద్యార్థులకు పుస్తకాలు లేకుండా ఏ విధమైన టీచింగ్ ఇస్తున్నారు, ఎటువంటి మెథడాలజీ వాడుతున్నారు వంటి విషయాలు తెలుసుకునేందుకు తాము ఈ స్కూలును సందర్శించినట్లు చెప్పారు. ఇక్కడ ప్రతి విద్యార్థి ప్రతిభను కనపరచడం అభినందనీయమన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ మళ్ల శర్వాణి మాట్లాడుతూ హోలిస్టిక్ ఎడ్యుకేషన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ వ్యవస్థాపక డైరెక్టర్ మళ్ల రామునాయుడు, అకడమిక్ డైరెక్టర్ మళ్ల వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి 'అల్కాటెల్'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నోకియా నుంచి ట్రేడ్‌మార్క్ లైసెన్స్ పొంది, టిసిఎల్ కమ్యూనికేషన్ ద్వారా నిర్వహించబడుతున్న ఫ్రెంచ్ టెక్ బ్రాండ్ అల్కాటెల్ భారతదేశంలో కార్యకలాపాలను ప్రారంభించనుందని ఆ సంస్థ ప్రతినిధి అతుల్ వివేక్ మీడియాకు తెలిపారు. ఈ బ్రాండ్ అత్యాధునిక సాంకేతికత కలిగిన ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌ల శ్రేణిని అల్కాటెల్ పరిచయం చేయనుందన్నారు. ఫ్రెంచ్ వారసత్వం, అధునాతన హార్డ్‌వేర్, ప్రత్యేక ఫీచర్లు, ఆకర్షణీయమైన డిజైన్‌తో భారతీయ మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి-రంపచోడవరం :రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిని ఎంఆర్‌పిఎస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిజనేతరులకు పక్కా ఇల్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించాలని అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే శిరీషాదేవి కోరడంపై మందకృష్ణ మాదిగ హర్షం వ్యక్తం చేశారని, ఆయన ఆదేశాలతోనే శిరీషాదేవిని కలిశామని ఎంఆర్‌పిఎస్ నాయకుడు సుబ్బారావు తెలిపారు. రానున్న కాలంలో కూటమితో కలిసి ఎమ్మార్పీఎస్ నడుస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో మాదిగలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించినట్లు సుబ్బారావు తెలిపారు.

పిఎఫ్, పెన్షన్ సమస్యలపై వినతి

ప్రజాశక్తి -గాజువాక :పిఎఫ్, పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భెల్, హెచ్‌పివిపి యూనిట్ గుర్తింపు యూనియన్ నేతలు మంగళవారం విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వీసు రిజిస్టర్‌లో సంవత్సరం వివరాలు తప్పుగా నమోదు కావడంతో పిఎఫ్ సమస్య నెలకొందని, దీనిపై భెల్ యాజమాన్యం తగు రికార్డులు, ఆధారాలు సమర్పించినా, పిఎఫ్ కార్యాలయంలో సమస్య పరిష్కరించడం లేదని విన్నవించారు.

అలాగే భెల్‌లోని అన్ని యూనిట్ల కార్మికులు హయ్యర్ పెన్షన్ అమలౌతున్నా, విశాఖ యూనిట్‌కు వర్తింపజేయక తిరస్కరించారని, ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎంపీ శ్రీభరత్ స్పందిస్తూ, హయ్యర్ పెన్షన్‌కు సంబంధించి ఆధారాలను తనకు ఇవ్వాలని, సమస్య పరిష్కరిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ నేతలు సుబాకర్ సాహూ, బోండా బాబురావు, పివిఎన్ రాజు, కొల్లి దేముడు, టెక్కలి భాస్కరరావు, అల్లం వెంకటేశ్వరరావు, టిఎల్ నరసింహారావు, అప్పలరాజు లక్ష్మణరావు, పెన్షనర్లు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం తగదు :యుటిఎఫ్

ప్రజాశక్తి -ఆనందపురం: విద్యాసంస్కరణల పేరిట పాఠశాలల విలీనం తగదని యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్ అన్నారు. పాఠశాలలు, విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలన్న యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పోరుబాటలో భాగంగా కుసులవాడ పంచాయతీ సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి శివాజీలకు మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ మాట్లాడుతూ. సంస్కరణలతో విద్యారంగంలో దుష్పరిణామాలను అరికట్టాలని కోరారు. దీనిపై గ్రామస్థాయిలో విద్యా కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు విద్యాశాఖ అధికారులు, ఎమ్మెల్యేల దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలన్నారు. పాఠశాలల విలీనంతో గ్రామీణ ప్రాంతాలలో తలెత్తే సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అరికట్టాల్సిన బాధ్యత గ్రామాల సర్పంచ్‌లు, విద్యాకమిటీ చైర్మన్లపై వుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.అప్పన్నబాబు, నర్సమాంబ, స్రవంతి, భారతి పాల్గొన్నారు

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- సీతమ్మధార: అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ నూతనకమిటీ ప్రమాణ స్వీకారం మంగళవారం అంబేద్కర్ భవన్‌లో జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులుగా బొడ్డేటి కల్యాణ్‌రావు, కార్యదర్శిగా జెవి ప్రభాకర్, ఇతర ప్రతినిధులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ భవనం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు

గీతంలో యోగా దినోత్సవ 'కౌంట్‌డౌన్ డే'

ప్రజాశక్తి-మధురవాడ : కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన మొరార్జీదేశాయ్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా మంజూరు చేసిన ప్రతిష్టాత్మక '100 డేస్, 100 సిటీస్, 100 ఆర్గనైజేషన్స్' యోగా ప్రాజెక్ట్‌లో భాగంగా, 2025 అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 74వ కౌంట్‌డౌన్ డేను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించారు.
విశాఖపట్నం ఆయుష్ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఝాన్సీరాణి, గీతం ప్రో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, రిజిస్ట్రార్ డి.గుణశేఖరన్, కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ కె. సునీత తదితరులు పాల్గొని, మానవ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో యోగా విలువను విశ్లేషించారు. యోగా శిక్షకురాలు డాక్టర్ స్వప్న, ఐదుగురు యోగా ఉపాధ్యాయులు యోగా సాధనల ప్రదర్శన చేశారు. యోగా ఆధారిత పాఠశాల రామా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు ఆధునిక యోగా ఆసన ప్రదర్శన చేశారు. యోగా కాన్షియస్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు, రామా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రవీంద్రనాథ్ యోగా ప్రయోజనాలను వివరించారు. యోగోత్సవంలో 600కి పైగా మంది, విద్యార్థులు, అధ్యాపకులు, యోగా సాధకులు, అనేక యోగా కేంద్రాలు, భారత నేవీ, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, ఆయుష్, వైద్యఆరోగ్యశాఖ, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు, ఇతర స్థానిక ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

గీతం అధ్యాపకులు, విద్యార్థులతోపాటు ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూషన్స్, సిల్వర్ ఓక్స్ స్కూల్, విశాఖ వాలీ స్కూల్, గాయత్రి విద్యా పరిషత్, రామా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ వంటి సంస్థలు భాగస్వామ్యం అయ్యాయి.యోగా చార్ట్ ప్రదర్శనను యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్‌తో కలిసి నిర్వహించారు.

జాతీయ రహదారి నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

అధికారులకు సమస్యను వివరిస్తున్న ఎంపిపి వెంకటలక్ష్మి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి :జాతీయ రహదారి నిర్మాణం వల్ల నష్టపోయిన బాధితులకు పరిహారం చెల్లించాలని ఎంపిపి గోము వెంకట లక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అరకు ఎంపీ తనూజా రాణి అధ్యక్షతన, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో పాడేరు కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ, మానటరింగ్ కమిటీ సమీక్షా సమావేశంలో ఎంపిపి మాట్లాడారు. మండలంలో నెలకొన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. జాతీయ రహదారి నిర్మాణంలో ఇల్లు నష్టపోయిన వారికి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. జడ్డంగి, ఒట్టిగడ్డ, దుసరిపాము, రాజవొమ్మంగి, కొండపల్లి సూరంపాలెం గ్రామాలకు నీటి సరఫరా అయ్యే పైపులైన్ తీసివేశారని, కొత్తవి వేయకపోవడంతో ఆ గ్రామాల ప్రజలు తాగునీటికి చాలా ఇబ్బంది పడుతున్నారని, వెంటనే వేయాలని కోరారు. హైవేకి అనుకొని ఉన్న రాజవొమ్మంగి మెయిన్ సెంటర్, దాకరాయి గ్రామాలలో అప్రోచ్ రోడ్ వేయాలన్నారు. ఇటీవల కురిసిన వడగల వానతో లాగరాయి, కొత్తకింద్ర, ధమనపాలెం, కింద్ర గ్రామాల్లో నష్టపోయిన మామిడి, జీడి మామిడి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ముందుగానే బిల్లు చెల్లించినా

తప్పని గ్యాస్ ధర పెంపు భారం

ప్రజాశక్తి- కొమ్మాది: కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలు పెంచకముందే గ్యాస్‌బండ్‌ను బుక్‌చేసుకుని, ఆన్‌లైన్‌లో పూర్తి బిల్లు మొత్తాన్ని ముందు గానే చెల్లించినా, అదనంగా రూ.50 చెల్లించా లంటూ గ్యాస్ ఏజెన్సీ బిల్లు ఇవ్వడంపై వినియోగ దారుడు ఆందోళన చెందు తున్నాడు.
మధురవాడ శివశక్తినగర్‌కు చెందిన ఆర్‌వి.రమణ అనే గ్యాస్ వినియోగదారుడు ఈనెల 7న గ్యాస్ బుక్ చేసుకుని, ఆన్‌లైన్‌లో బిల్లు మొత్తాన్ని రూ.810 చెల్లించాడు. గ్యాస్ ధరలు పెంచకుముందే ఇదంతా జరగ్గా, మంగళవారం స్థానిక దివ్యలక్ష్మి, హెచ్‌పిగ్యాస్ ఏజెన్సీ నుంచి గ్యాస్ డెలివరీ చేయగా, అప్పటికే బిల్లు చెల్లించినప్పటికీ, పెంచిన అదనపు ధర రూ.50 చెల్లించాలంటూ బిల్లు ఇవ్వడంపై వినియోగదారుడు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. కేంద్రం గ్యాస్‌ధర పెంచకముందే మొత్తం బిల్లు చెల్లింపులు చేసినా అదనపు భారం తనపై వేయడం సరికాదని అంటున్నాడు. దీనిపై సంబంధిత గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులను సంప్రదించగా, సిలెండర్ డెలివరీ రోజున ఉన్న ధరను వసూలు చేస్తామని, ఇదంతా ఆన్‌లైన్‌లో జరుగుతుందని, ఏజెన్సీకి సంబంధం లేదని హెచ్‌పి గ్యాస్‌డీలర్ హేమంత్, మేనేజర్ జివికె.రాజు అంటున్నారు.



గ్యాస్ ఏజెన్సీ ఇచ్చిన బిల్లు

'సాంకేతిక'లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం పాలెంలోని సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. చెన్నై డునామిస్ మెషీన్స్ సంస్థ తమ తమ కార్యకలాపాలను విస్తరించడంలో భాగంగా డునామిస్ మెషీన్స్ చెన్నై విభాగానికి 52 మంది ఇంజనీర్ ట్రైనీలను ఎంపిక చేసుకుంది. సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీ నుంచి 22 మంది, సాంకేతిక పాలిటెక్నిక్ కాలేజీ నుంచి 10 మంది, ఆళ్వార్ దాస్ పాలిటెక్నిక్ నుంచి ముగ్గురు, సమీప కాలేజీల నుంచి 17మందిని ఎంపిక చేసినట్లు సాంకేతిక విద్యాసంస్థ హెచ్ ఆర్ మేనేజర్ మీరా కుమారి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు జూన్ మొదటి వారంలో విధుల్లో చేరుతారని ఆళ్వార్ దాస్ గ్రూప్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.తులసి కృష్ణ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆళ్వార్ దాస్ గ్రూప్ సెక్రటరీ, కరెస్పాండెంట్ డాక్టర్. ఎస్‌వి హెచ్. రాజేంద్ర, ఇడి సుంకరి రాహుల్ ఆళ్వార్‌దాస్, ఇఒ మధుభట్, ఎ.నాగేశ్వరరావు, అక్షత కొండూర్, విష్ణు కొండూర్ పాల్గొన్నారు.

స్వయం పాలన ఉద్యమానికి కలిసి రావాలి

ప్రజాశక్తి-సీలేరు : ఆదివాసీ మేధావులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి లోకం, ప్రజలు చైతన్యవంతులై స్వయంపాలన ఉద్యమంలో కలిసి రావాలని దండకారణ్య విమోచన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కిల్లో మనోజ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల ఐదున పాడేరులో జరిగిన దండకారణ్యం విమోచన సమితి రాష్ట్ర, జిల్లా కమిటీల ఎన్నికలు డాక్టర్ కేశవరావు, బిఎస్ఎన్ పడాల్, కొండబాబు ఆధ్వర్యంలో జరిగినట్లు చెప్పారు. సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా తను ఎన్నికైనట్లు తెలిపారు. గూడెం మండలంలో నేటికీ ఆదివాసీలకు కనీసం మౌలిక సదుపాయాలు లేక సరైన విద్య అందక అభివృద్ధికి దూరంలో ఉన్నారని వాపోయారు. ఆదివాసీల గురించి ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే ప్రత్యేక దండకారణ్య రాష్ట్రం ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సీలేరులో వర్షం

సీలేరులో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం 7 గంటల నుంచి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించడంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజలు ఉక్కపోతతో అనేక ఇబ్బందులకు గురయ్యారు. సాయంత్రం 3 గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై మబ్బులు కమ్ముకున్నాయి. అనంతరం సీలేరు పరిసర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. దుప్పిలివాడ పంచాయతీ శాండికోరి గ్రామంలో ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. అధిక ఉష్ణోగ్రతతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం కాస్త ఉపశమనం కలిగించింది.

బాప్టిస్ట్ చర్చి ప్రారంభం

సీడీని ఆవిష్కరిస్తున్న జయప్రకాశ్

ప్రజాశక్తి-ఎటపాక : ఎటపాక మండలం కృష్ణవరం పంచాయతీ పరిధిలో చింతలచెరువులో బెరయా బాప్టిస్ట్ సంస్థ బ్రాంచ్ చర్చిను మంగళవారం బెరయా బాప్టిస్ట్ చర్చి వ్యవస్థాపకుడు జలకం భీమయ్య ఆధ్వర్యాన ప్రారంభించారు. ముఖ్య అతిథిగా అంతర్జాతీయ ప్రసంగికులు, దుమ్మేరు ఏసుక్రీస్తు ప్రార్థన మందిరం పాస్టర్ రవికుమార్ హాజరయ్యారు. స్థానిక పాస్టర్ వెంకటరాజు రచించి, స్వరకల్పన చేసిన సీడీని ఆదివాసీ సువార్త గాయకుడు జయ ప్రకాష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రజల్లో స్నేహ భావం పెంపొందెల భక్తుల నడవడిక ఉండాలని సూచించారు. అనంతరం ప్రత్యేక ఆహ్వానితులను సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణవరం సర్పంచ్ కృష్ణ, చింతూరు డివిజన్ పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు పిటర్ సింగయ్య, బాబు, గంగరాజు, ఏసుబాబు, గణేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.